క్లుప్తంగా

నూకాలమ్మ జాతరకు శ్రీకారం



సిరిపురంలో పూలగరగకు పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. అమ్మవారి ఆలయంలో పూల గరగలు తీసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 28న జాతర, 29న తీర్థం, 30న పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల నూకరాజు, అల్లం ఆదినారాయణ, అనపర్తి భాను, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



తామరాడలో రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కిర్లంపూడి: మండలంలోని తామరాడలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జగ్గంపేటకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన 65 మందికి వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం కోసం మరో ఆరుగురిని జగ్గంపేటలోని ఆసుపత్రికి పంపినట్టు వైద్యులు బట్టు శాంతారావు తెలిపారు. టెక్నీషియన్లు షేక్ రషీద్, కె.హరిచందన్ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు



తునిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

తుని: స్థానిక గణపతినగర్ మున్సిపల్ పార్కు ఆవరణలో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ అదినారాయణ సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ తరఫున తమలపాకు, వెల్లుల్లి, తేనే, అల్లంతో కూడిన కిల్లీని ఉచితంగా అందజేశారు. తుని సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, డిప్యూటీ గవర్నర్ సీహెచ్ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శివ, కార్యదర్శి రాజు, కోశాధికారి ప్రిన్సిపత్తి బాబు, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ ఆదివారం తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించడంతో పాటు 2024–25 సవరణ బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌ను ఆమోదిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



తునిలో హెల్మెట్ ధారణపై బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు, యువత

తుని: వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల సమయంలో ప్రాణాప్రాయం నుంచి రక్షణ పొందవచ్చునని తుని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ అన్నారు. తునిలో ఆదివారం రోటరీక్లబ్ ఆఫ్ సెంట్రల్, గురు న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 100 మంది బైక్ ర్యాలీ చేసి హెల్మెట్ ధారణ వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు చక్కా శ్రీధర్, కార్యదర్శి దండెం కృష్ణ, డాక్టర్ గురు ప్రసాద్, ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ భగవాన్, దండెం రామకృష్ణ పాల్గొన్నారు.

హై టెన్షన్ వే

- జాతీయ రహదారిపై దుకాణాల వద్ద వాహనాల నిలుపుదల
- తరచూ ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న ప్రజలు
- పట్టించుకోని హైవే అథారిటీ అధికారులు

గండేపల్లి: మితిమీరిన వేగంతో రెప్పపాటు కాలంలోనే ప్రమాదాలు చోటుచేసుకోవడం హైవేపై పరిపాటిగా మారింది. డ్రైవర్ల నిర్లక్ష్యం ఇందుకు తోడవ్వడంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. వాహనాలను రోడ్డు మార్జిన్‌లో నిలపడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో హైవేపై ప్రయాణం అంటేనే ప్రజలు టెన్షన్ పడుతున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో హైవే వెంబడి ఉన్న టీ టైమ్స్, దాబాలు, హోటళ్లు వద్ద రహదారిపైనే వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

తరచూ ప్రమాదాలు:

పలు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న 16వ నంబర్ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. హైవే నిత్యం రద్దీగా ఉంటోంది. మితిమీరిన వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లేని డ్రైవింగ్‌లతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టి అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఫలితం లేదు.

జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 28 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. హైవే వెంబడి ఉన్న దుకాణాల వద్ద వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని హైవేపై నిత్యం చిన్నదో, పెద్దదో ప్రమాదం సంభవించడం పరిపాటిగా మారింది.

నిబంధనలు తూచ్

గండేపల్లి మండలంలో మురారి శివారు నుంచి కిర్లంపూడి మండలంలోని సోమవరం గ్రామం వరకూ హైవే వెంబడి దాబాలు, టీ టైమ్‌లు, హోటళ్లు సుమారు 30 వరకూ ఉన్నాయి. వీటి నిర్వహణలో సమయాభావం పాటించడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అర్ధరాత్రికి ముందుగానే దుఖాణాలు మూసివేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అర్ధరాత్రులు సైతం టీ టైమ్‌లు, దాబాలు, హోటళ్ల నిర్వాహకులు వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఆయా షాపుల వద్ద నిలుపుతున్న వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



హైవేపై టీ టైమ్ షాపు వద్ద నిలిపిన వాహనాలు

ప్రాణాలు పోతున్నా..

మల్లేపల్లి శివారు జీడిపిక్కల ఫ్యాక్టరీకి సమీపంలోని దుర్గ టీ టైం వద్ద కళాకారులతో శ్రీకాకుళం వెళుతున్న టాటా మ్యాజిక్ వ్యాన్ తెల్లవారుజామున ఆగి ఉన్న ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొందరు గాయాలపాలయ్యారు. అలాగే తాళ్లూరు శివారు దాబాల వద్ద నిలిపిన లారీని అన్నవరం నుంచి వస్తున్న కారు పట్టపగలే ఢీకొట్టడంతో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మురారి శివారులో గల టీ టైం వద్ద తెల్లవారుజామున విశాఖ వెళుతున్న బస్సు టీ తాగేందుకు ఆగిన వారిపై నుంచి దూసుకుపోవడంతో ఒకరు మృతి చెందగా కొందరు గాయాలపాలయ్యారు. యువత ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్కోసారి ఇతర ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ఇటీవల కాలంలో రామవరం వద్ద జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై జగ్గంపేట వైపు వస్తున్న యువకులు ప్రమాదానికి గురై అక్కడిక్కడే ఇద్దరు, ఆస్పత్రిలో మరో యువకుడు మృతి చెంది కన్నవారికి కడుపుకోత మిగిల్చారు. టీ టైమ్‌లు, దాబాల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



తాళ్లూరు శివారు దాబాల వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు (ఫైల్)

హైవేపై ప్రత్యేక నిఘా



గండేపల్లి మండలంలోని మురారి నుంచి కిర్లంపూడి మండలంలో సోమవరం గ్రామం వరకూ జాతీయ రహదారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మొబైల్ పార్టీ, హైవే పెట్రోలింగ్ ద్వారా తనిఖీలు చేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రత్యేక అవగాహన సదస్సులు ద్వారా డ్రైవర్లను చైతన్య పరుస్తున్నాం.

సీఐ, వైఆర్కే శ్రీనివాస్, జగ్గంపేట

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి



హైవేపై టీ టైమ్స్ ముసుగులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి. టీ టైమ్స్, దాబాలను సమయపాలన లేకుండా నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటల తరువాత కూడా దుకాణాలు తెరిచే ఉంటున్నాయి. రాత్రి 2 గంటల సమయంలో టీ టైమ్స్ దుకాణాల వద్ద జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలతో జనసందోహంగా ఉంటోంది. ఇటువంటి వాటిని అరికట్టాలి.

పులి ప్రసాద్, ఆర్పీఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ

ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడిగా గాంధీ



సత్రం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గాంధీని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

అన్నవరం: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి నిత్యాన్నసత్ర సమాజం (ఆర్యవైశ్య సత్రం) కమిటీ అధ్యక్షుడిగా పేరూరి గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ కార్యవర్గ సమావేశం గౌరవాధ్యక్షులు చెక్కా సూర్యనారాయణ (తాతబాబు) అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సత్రానికి గత 25 సంవత్సరాలుగా కార్యదర్శి, అధ్యక్షుడు తదితర హోదాల్లో సేవలందిస్తున్న పేరూరి గాంధీని తిరిగి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సత్రం కార్యదర్శిగా రేపాక రామసత్యనారాయణ, కోశాధికారిగా తల్లం సత్యారావు, ఇతర కార్యవర్గ సభ్యులను మరో రెండేళ్ల పాటు కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన

గండేపల్లి: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో నీటి సంరక్షణ, స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ అధిపతి, శాస్త్రవేత్త ఎస్వీ విజయకుమార్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వర్షపు నీటి సేకరణ ప్రాముఖ్యత, నీటి కొరతను తగ్గించడంలో ప్రభుత్వాల పాత్ర తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవయోధులకు ఘన నివాళి



ఏలేశ్వరంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు



ప్రత్తిపాడులో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లిబరేషన్ శ్రేణులు

ఏలేశ్వరం: భారత విప్లవయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన భగత్‌సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీయడం బాధాకరమన్నారు. భారతదేశ ముద్దుబిడ్డ భగత్‌సింగ్ ఆశయాలను నేటియువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చిన్న వయస్సులో అసువులుబాసిన భగత్‌సింగ్ దేశప్రజలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా బ్రిటిషు వారిని ఎదిరించిన భగత్‌సింగ్‌కు ప్రజలు ఎన్నటికీ రుణపడి ఉంటారన్నారు. అలాగే సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పిల్లా రాంబాబు, దంగేటి వేణుబాబు, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: భారత స్వతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ మార్గంలో అనేక మంది పయనించారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రేచుకట్ల సింహాచలం అన్నారు. ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్ 91వ వర్ధంతిని నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి రేచుకట్ల సింహాచలం పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర్య ఉద్యమం అవసరమన్నారు. కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, నీలి సత్యనారాయణ, ఇరటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాడుదాం



తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద మాట్లాడుతున్న శివగణేశ్

గండేపల్లి: రైతుల సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాడుదామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్ పిలుపునిచ్చారు. మండలంలోని తాళ్లూరు పుష్కర లిఫ్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించి మీడియాతో మాట్లాడారు. తాళ్లూరు స్టేజ్–2 పుష్కర లిఫ్ట్ ద్వారా 37,028 ఎకరాలకు నీరు పూర్తిస్థాయిలో అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. లిఫ్ట్ మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారని, ఆయన పోరాటానికి అందరం సహకరిద్దామన్నారు. వారంలో ప్రతి శుక్ర, శనివారాల్లో తాళ్లూరు లిఫ్ట్, పంట పొలాలను పరిశీలించి అనంతరం హైవేపై నిరసన చేపట్టాలన్నారు. ఈ నిరసనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఏలేరు రిజర్వాయర్ ఆధునీకరణకు రూ.2 వేల కోట్లు అవసరం కాగా ప్రభుత్వం కేవలం రూ.2 కోట్లు ఖర్చు చేయడం అధికారుల టీ ఖర్చులకు కేటాయించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏపీసీసీ జనరల్ సెక్రటరీ నక్క సత్యనారాయణ, జగ్గంపేట, గండేపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు వత్సవాయి బాబు, నేదూరి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



అల్లిపూడిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు ప్రతినిధులు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో మాల మహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాల మహానాడు మండలశాఖ ప్రతినిధులు దుత్తుర్తి సతీష్, యాదగిరి నానాజీ, నెమ్మాది పెదబాబులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసి ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందని మండిపడ్డారు. విద్యా, ఉద్యోగ, సామాజిక జీవన రంగాల్లో మాలలను అణచి వేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు, జాతీయ గౌరవాధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ నాయకత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

అన్నవరంలో రక్తదాన శిబిరం

అన్నవరం: స్థానిక దేవస్థానం ఆసుపత్రిలో 'సంకల్పం', 'హెల్పింగ్ వింగ్స్' స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 64 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని సంకల్పం సంస్థ సభ్యులు యడ్ల వరప్రసాద్, మహేంద్రవాడ జగదీష్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. దేవస్థానం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఫార్మాసిస్ట్ వి.మాధవి, సీనియర్ నర్స్ సరోజిని, సిబ్బంది సేవలందించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు స్వచ్ఛంద సంస్థల సభ్యులను అభినందించారు.



రక్తదానం చేస్తున్న యువకులు

పీ4 సర్వేపై నేడు గ్రామ సభలు

ప్రత్తిపాడు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం పీ4 సర్వేపై గ్రామసభలు నిర్వహించనున్నట్టు ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆదివారం తెలిపారు. పీ4 సర్వేలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో సరిచేసి, తుది జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రకటిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు చినశంకర్లపూడి, చింతలూరు, ధర్మవరం, గజ్జనపూడి, గోకవరం, పెదశంకర్లపూడి, పెద్దిపాలెం, పోతులూరు, ప్రత్తిపాడు, రాచపల్లి, ఉద్దండ జగన్నాథపురం, వెంకటనగరం, ఏలూరు గ్రామాల్లోని సచివాలయాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటలకు బురదకోట, బవురువాక, లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి గ్రామాల్లోని సచివాలయాల్లో సభలు నిర్వహిస్తారని ఎంపీడీఓ కుమార్‌బాబు వివరించారు.

రత్నగిరిపై మొక్కల పెంపకం పరిశీలన



సమావేశంలో పాల్గొన్న ఫారెస్ట్ అధికారి శివరామప్రసాద్, ఈఓ సుబ్బారావు తదితరులు

అన్నవరం: రత్నగిరి, సత్యగిరి కొండలపై ఖాళీ స్థలాలు, పలు గ్రామాల్లోని అన్నవరం దేవస్థానం భూముల్లో ఏయే మొక్కలు పెంచాలనే దానిపై ఆదివారం అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటివ్ అధికారి ఎన్వీ శివరామప్రసాద్ పరిశీలన జరిపారు. రత్నగిరి, సత్యగిరులపై దేవస్థానంలో పూజలకు ఉపయోగించే మారేడు, తులసి, నీడ నిచ్చే చెట్లు పెంచాలని సూచించారు. దేవస్థానానికి కొండదిగువన గల దిబ్బగా రైన్, రైల్వేస్టేషన్ వద్ద, డిగ్రీ కళాశాల వద్ద మారేడు వనాలను, చెందుర్తి, గొంది గ్రామాల్లో దేవస్థానం భూములను ఆయన పరిశీలించారు. ఆయన ఇచ్చే నివేదిక ఆధారంగా మొక్కలు నాటనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వీర్ల సుబ్బారావు, డీసీ చంద్రశేఖర్, ఏసీ రామ్మోహన్‌రావు, ఏఈఓ రెడ్డి, సూపరింటిండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత నిరసనను అడ్డుకోవడం దారుణం



శివగణేష్‌ను అడ్డుకుని మాట్లాడుతున్న సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్

గోకవరం: అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా చేస్తున్న శాంతియుత నిరసనలు అడ్డుకోవడం ప్రభుత్వ దౌర్జన్యానికి పరాకాష్ట అని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి మరోతి శివగణేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక, బావాజీపేట, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన పలువురితో కలిసి ఆయన నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో వీరలంకపల్లిలో ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. నిరసన హక్కును హరించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమేనన్నారు. అస్సాగో సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

30న సురభి కామధేను మహాయజ్ఞం



అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ఆవు పిడకలను తయారు చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 30న సురభి కామధేను మహాయజ్ఞాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీరమణ సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద తెలిపారు. ఈ యజ్ఞం నిమిత్తం ఆలయ ప్రాంగణంలో స్థానిక మహిళలు గోమయంతో లక్షా ఎనిమిది వేల పిడకలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. గత రెండు వారాలుగా ఆలయ ప్రాంగణంలో పిడకలు తయారీ జోరుగా సాగుతోంది. ఉగాది పర్వదినాన జరిగే ఈ మహాయజ్ఞంలో ఆవుపిడకలతో పాటు 21 రకాల ఔషధాలతో తయారు చేసిన హోమం పొడి, తొమ్మిది రకాల సమిదలు, 250 కేజీల ఆవు నెయ్యను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

వ్యర్థాలకు నిప్పు.. తప్పిన పెను ముప్పు



తునిలో పెట్రోల్ బంకు సమీపంలో మండుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

తుని: స్థానిక పాలూరి పెట్రోల్ బంకు పక్కన వ్యర్థాలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగడంతో ప్రజలు ఆందోళన చెందారు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి కాల్చిన సిగరెట్ పడవేయడంతో మంటలు వ్యాపించాయి. మంటలు చెలరేగిన ప్రాంతానికి కూతవేటు దూరంలో పెట్రోల్ బంకు ఉండడంతో ప్రజలు భయాందోళన చెందారు. మంటలు బంక్ వరకూ విస్తరించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోజువారీ వచ్చే వ్యర్థాలను మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది రైల్వే ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. వీటిలో ఎక్కువ శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయి. గతంలోనూ పలుమార్లు మంటలు వ్యాపించాయి. పెద్దగా అగ్నికీలలు పైకి లేవడంతో తుని అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అదుపు చేశారు. రైల్వే, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కలిసి డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వేసవి సమయంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు.

ప్రయాణం.. ఆహ్లాదకరం



తుని జీఎస్‌టీ రోడ్డు సెంటర్ డివైడర్‌లో కనువిందు చేస్తున్న పూలమొక్కలు

తుని: ప్రకృతి ప్రేమికులను పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. తుని పట్టణం జీఎస్‌టీ రోడ్డు డివైడర్‌లో డెక్కన్ కెమికల్స్ సహకారంతో మొక్కల పెంపకం చేపట్టారు. సుమారు 2.5 కిలోమీటర్లు మేర వివిధ రకాల పూల మొక్కలను వేశారు. ప్రస్తుతం రంగు రంగుల పుష్పాలు కొత్త శోభను తీసుకువచ్చాయి. వాహన చోదకులు, పాదచారులు వీటి అందాలను ఆస్వాదిస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా డెక్కన్ సంస్థ వీటి నిర్వహణను చేపట్టడంతో ఆకర్షణీయంగా కనువిందు చేస్తున్నారు.

